క్లుప్తంగా

గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్ తప్పనిసరి



ముసిరి గ్రామంలో గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

డుంబ్రిగుడ: అరమ పంచాయతీ అరమ, ముసిరి, గుమ్మగుడ, పరిడి, డుంబ్రివలస, సంతవలస, గొందిగుడ తదితర గ్రామాల్లో పశు సంవర్ధకశాఖ వైద్యాధికారి రాజశ్రీ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో సుమారు 812 మేకలు, గొర్రెలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేసినట్టు చెప్పారు. గొర్రెలు, మేకలకు ఎటువంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు ముందస్తుగా పీపీఆర్ వ్యాక్సిన్‌ను వేయించాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యురాలు పద్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు తుమ్‌నాథ్, సిబ్బంది త్రినాథరావు, సంజీవ్, అప్పారావు, అనంతరావు, రత్నం, బాలు, ప్రకాష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జీసీసీతో కాఫీ రైతులకు గిట్టుబాటు ధరలు



రైతుల దగ్గర కాఫీ కొనుగోలు చేస్తున్న జీసీసీ మేనేజర్ మల్లేశ్వరరావు

గూడెంకొత్తవీధి: గిరిజన రైతులు పండిస్తున్న కాఫీకి జీసీసీ గిట్టుబాటు ధరలు చెల్లిస్తోందని స్థానిక జీసీసీ మేనేజర్ గసాడి మల్లేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని పలువురు రైతుల వద్ద గురువారం కాఫీని కొనుగోలు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కాఫీ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడమే లక్ష్యంగా కిలో చెర్రి రూ.135, పార్చిమెంట్ రూ. 270కు కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా జీసీసీకి విక్రయించాలని ఆయన కోరారు. రైతుల వద్దకు వెళ్లి కొనుగోలు చేస్తున్నామని, రైతుల వద్ద రవాణాకు సంబంధించి ఎటువంటి చార్జీలు వసూలు చేయడం లేదన్నారు. సేల్స్ మెన్ నారాయణరావు తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో గురువారం నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుడు శ్రీనివాసవర్మ, పద్మ దంపతులచే ప్రతిష్ట కార్యక్రమం పూర్తి చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఆలయాల్లో అన్నసమారాధన

మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు.

కాఫీ బకాయిలు చెల్లించాలని వినతి



ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన సంఘం నేతలు, రైతులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో కాఫీ రైతులు గురువారం ర్యాలీ నిర్వహించారు. కాఫీ బకాయిలు చెల్లించాలని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. గిరిజన సంఘం ప్రతినిధులు పృథ్వీరాజ్, నర్సయ్య, నారాయణ, శ్రీను, కాఫీ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యం ప్రజా సంక్షేమం

- గూడెం కొత్తవీధి, అరకులోయలో 'గడప గడప' కు విశేష ఆదరణ
- గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ



ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను గిరిజనులకు అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

గూడెంకొత్తవీధి: పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని దామణాపల్లి పంచాయతీ సిగినాపల్లి, అన్నవరం, కట్టుపల్లి, నూతిబంధ గ్రామాల్లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 280 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఆమెకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి నవరత్న పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలుచేస్తున్నారన్నారు. గిరిజనుల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో జగనన్న సుపరిపాలన, అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయన్నారు. ప్రజా సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమన్నారు. ఎంపీపీ బోయిన కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు శివరత్నం, వైస్ ఎంపీపీ దేముడు, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జైతు రాజులమ్మ, పీఏసీఎస్ చైర్మన్ ప్రసాద్, సర్పంచ్ కె.రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు నాగమణి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంత అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

అరకులోయ రూరల్: గిరిజన ప్రాంత అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలో సిర్గం పంచాయతీ తెంగడవలస, వితోకవలస, వర్ర గ్రామాల్లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో 205 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారన్నారు. శివారు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందించినట్టు చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపు ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ఎంపీపీ ఉషారాణి, మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్(శ్రీను), సర్పంచ్ కాంతమ్మ, నాయకులు గురుమూర్తి, మిన్ను, చిరంజీవి, బాలరాజు, సాంబ, నర్సింగ్, రంజిత్‌కుమార్, సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి శశికాంత్

జి.మాడుగుల: స్పర్శ కుష్టు వ్యాధిపై అవగాహనతో వ్యాధి నిర్మూలించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి శశికాంత్ తెలిపారు. మండలంలో నుర్మతి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో గురువారం సర్శ కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధి మైక్రో బ్యాక్టీరియా లెప్రే ద్వారా వస్తుందని, ఈ క్రిములు తుమ్మటం, దగ్గటం వలన వ్యాప్తి చెందుతాయన్నారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, చర్మంపై రాగి రంగు మచ్చలు, నొప్పితో కూడి నరాలు, కాళ్లు, చేతులు కండరాల్లో బలహీనత, తిమ్మర్లుగా అనిపిస్తాయన్నారు. నొప్పిగా అనిపించని పుండ్లు చేతులు, పాదాలలో ఉండడం తదితర లక్షణాలు కన్పిస్తే ఆస్పత్రిల్లో పరీక్షలు చేయించుకోని తగిన వైద్యం పొందాలని ఆయన వివరించారు. ఎంపీహెచ్‌ఈవో ఎస్.ప్రకాష్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు



బోంద్రుగూడలో పైపులైన్ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ నీలకంఠం, నేతలు

ముంచంగిపుట్టు: జల్ జీవన్ మిషన్ పథకంతో ఇంటింటికీ తాగునీరు అందించనున్నట్టు జోలాపుట్టు పంచాయతీ సర్పంచ్ డి.నీలకంఠం అన్నారు. పంచాయతీ పరిధిలోని బోంద్రుగూడ గ్రామంలో గురువారం జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.10లక్షలతో జరుగుతున్న తాగునీటి పైపులైన్ పనులను సర్పంచ్ నీలకంఠం, నేతలు పరిశీలించారు. వేగంగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ నీలకంఠం మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో నీటి సమస్యలు పరిష్కారమవుతాయని, ఇంటింటికీ నీటి సరఫరా జరుగుతుందని గిరిజన మహిళలు సుదూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తీసుకువచ్చే కష్టాలు తొలుగుతాయన్నారు. నేతలు జగబందు, భగత్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగి ఔదార్యం



వధూవరులతో సత్యనారాయణ దంపతులు

సీలేరు: ఓ అనాథ యువతికి అన్నీ తానై వివాహం చేయించి ఓ రెవెన్యూ ఉద్యోగి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. జీకే వీధి మండలం దుప్పిలవాడ పంచాయతీ భూసుకొండ గ్రామానికి మరిగెల స్వాతి తల్లిదండ్రులు బాబూరావు, రాములమ్మ 2015లో మృతి చెందారు. అనాథగా మిగిలిన ఆ కుటుంబంలోని నలుగురు చిన్నారులను సత్యనారాయణ చేరదీశారు. వారి ఆలనాపాలన చూడడంతో పాటు చదివించారు. వీరిలో పెద్ద అమ్మాయి అయిన స్వాతి బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతుంది. ఆమెకు భూసుకొండ గ్రామానికి చెందిన శంఖం రాంబాబుతో వివాహం జరిపించారు. స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం వరుడు రాంబాబుకు సత్యనారాయణ దంపతులు కాళ్లు కడిగి కన్యాదానం చేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి సామగ్రి అందజేస్తున్న దాత సీతారామన్నదొర

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ గ్రామ సచివాలయ పరిధిలోని కోకితగొంది గ్రామ వలంటీర్ ఆర్.వి.వి.సత్యనారాయణరెడ్డి కుటుంబాన్ని జాతీయ ఆదివాసీ సంరక్షణ సమితి కన్వీనర్ సీతారామన్నదొర(డిల్లీబాబు) గురువారం కలిసి పరామర్శించారు. ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సత్యనారాయణరెడ్డి పూరిల్లు దగ్ధమైంది. ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి సీతారామన్నదొర నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి, దుస్తులు దుప్పట్లు, నగదు సాయమందించారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే అండగా ఉండి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమితి ప్రతినిధులు గంగాధరరావు, వీరప్రతాప్‌దొర, శ్రీనివాసదొర, చిన్నబ్బాయిదొర, వైఎస్సార్‌సీపీ నాయకులు తమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

జి.మాడుగుల: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేటలోని ఆయిల్ కంపెనీలో జరిగిన సంఘటనలో పెదబయలు మండలానికి చెందిన గిరిజన యువకులు మృతి చెందడంపై మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వారు గురువారం మాట్లాడుతూ పెదబయలు మండలానికి చెందిన పేద గిరిజనులు ఆయిల్ కంపెనీలో కార్మికులుగా పనిచేయటానికి వెళ్లారని, ఇంతలో ఈ దుర్ఘటన జరగడం దారుణమన్నారు. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించి, ఆదుకోవాలని, తగిన న్యాయం చేయాలని వారు కోరారు.

బీమా సొమ్ము అందజేత



బాధిత కుటుంబానికి బీమా సొమ్ము అందజేస్తున్న సర్పంచ్ సుభద్ర

గూడెంకొత్తవీధి: మండలంలోని గూడెం గ్రామానికి చెందిన రావిడి కృష్ణకుమారి ఇటీవల అనారోగ్యంతో విశాఖలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. పూజారిపాకలుకు చెందిన గుంట శుక్ర అనారోగ్యంతో మృతి చెందారు. ఆయా కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా తక్షణ సాయంగా రూ.10వేల చొప్పున సర్పంచ్ కొర్రా సుభద్ర గురువారం అందజేశారు. మిగిలిన సొమ్ము నామిని ఖాతాలో జమ అవుతుందని సర్పంచ్ తెలిపారు. వైస్ సర్పంచ్ రాంబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ వినోద్, వలంటీర్ ముక్కలి గిరి , శంకర్, సాయి పవన్, గృహసారథి పుష్ప తదితరులు పాల్గొన్నారు.

13న మండల పరిషత్ బడ్జెట్ సమావేశం

గంగవరం : మండల పరిషత్ బడ్జెట్ సమావేశం ఈనెల 13న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బి.శ్రీనివాసులు గురువారం ఒకప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అధ్యక్షత వహిస్తారని, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారుల పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

మన్యం పాలపిండికి గిరాకీ

- ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో విస్తారంగా సాగు
- కిలో రూ.250 నుంచి రూ.300 వరకు అమ్మకాలు



గుమ్మసిరగంపుట్టులో ఓ ఇంటి బయట ఎండబెట్టిన పాలపిండి



పాలపిండికి సిద్ధం చేసిన దుంప రసం

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ముంచంగిపుట్టు, పెదబయలు, ఒడిశాలోని లంతాపుట్టు, మాచ్‌ఖండ్, ఒనకడిల్లీ, పాడువ ప్రాంతాల్లో పాలపిండి సాగుని గిరిజనులు విస్తారంగా చేస్తున్నారు. పసుపు మొక్కలు ఆకారంగానే ఉంటూ పసుపు పంట విధంగానే పండిస్తారు. ఏడాది పొడవునా భూమిలో పసుపు పంట లాగా పండిస్తూ నేల నుంచి దుంపను తీసి శుభ్రం చేసి గంటల కొద్ది జల్లేడపై రుద్ది దాని నుంచి వచ్చే పిప్పి రసాన్ని పాత్రలోకి సేకరిస్తారు. ఒక రాత్రంతా రసాన్ని ఊరబెడతారు. ఉదయాన్నే చాపల్లో, పాత్రల్లో ఈ రసాన్నీ పోసి ఎండబెడతారు. వారం రోజులు తర్వాత కేకు ఆకారంలో గట్టిగా తయారవుతుంది. అనంతరం వీటిని ముక్కలుగా కోస్తారు. ఇలా ఎంతో కష్టబడి పాలపిండిని తయారు చేస్తారు సరిహద్దు గిరిజనులు. మార్కెట్‌లో పాలపిండి కిలో రూ.250 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారు. దీనిని మైదాన ప్రాంత వాసులు సరిహద్దుకు వచ్చి అధికంగా కొనుగోలు చేస్తున్నారు. మైదాన ప్రాంతంలో కిలో రూ.400లకు పైగానే ధర పలుకుతుంది. పాలపిండిని నీటిలో కలుపుకొని తీసుకుంటారు. చిన్నపాటి చేదు అనిపించే వారు పంచదారను సైతం కలుపుకొని తీసుకుంటారు. పాలపిండి రసం ఒంటికి చలువ చేస్తోందని గిరిజనులు చెబుతారు. ప్రస్తుతం మండలంలోని కర్రిముఖిపుట్టు, కించాయిపుట్టు, సుజనకోట, జర్రెల, బరడ, జర్జుల పంచాయతీల్లో గిరిజన మహిళలు పాలపిండి తయారీలో నిమగ్నమై ఉన్నారు. ఏ ఇంటి బయట చూసినా పాలపిండి దుంప రసాన్ని ఎండబెట్టిన దృశ్యాలే కనిపిస్తున్నాయి.

గర్భిణులకు వైద్య పరీక్షలు



సీహెచ్‌సీలో గర్భిణులకు స్కానింగ్ చేస్తున్న వైద్యాధికారులు



చింతపల్లి ఆస్పత్రికి వచ్చిన గర్భిణులు

వై.రామవరం: పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం 124 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.గౌతమి ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్, రక్తపరీక్షలు చేసి, మందులు అందజేశారు. వారిలో 20 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఆస్పత్రిలో జాయిన్ చేసుకున్నారు. వారికి ప్రత్యేక వైద్య సేవలతోపాటు, అవసరమైన మందులు అందించారు. వైద్య శిబిరానికి హాజరైన గర్భిణులకు భోజన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించారు. సీహెచ్‌సీ వైద్యాధికారులు రాహుల్, చైతన్య, గైనకాలజిస్టు డాక్టర్ వెంకట రత్నం, సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో కూడా వైద్యాధికారుల ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగులు, ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు.

చింతపల్లిరూరల్: పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో చింతపల్లి, గూడెం మండలాలకు చెందిన 250 మంది గర్భిణులకు డాక్టర్ కీర్తి గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల గర్భిణులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వారిలో హైరిస్క్‌లో ఉన్న గర్భిణులను గుర్తించి వైద్య పర్యవేక్షణలో ఉంచామన్నారు. గర్భిణులు పాటించాల్సిన జాగ్రత్తలు, తీసుకోవలసిన పోషకాలు గురించి వారికి తెలియజేశారు. సిబ్బంది వైద్య సేవలందించారు.

అర్హులందరికీ పథకాలు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం

ముంచంగిపుట్టు: మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ శరభపుట్టు గ్రామంలో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం గురువారం పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోందన్నారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అడవిరాజులబాబు పండగ

మాకవరపాలెం: తామరం, పైడిపాల, తదితర గ్రామాల్లో అడవిరాజులబాబు పండగను ప్రజలంతా వైభవంగా జరుపుకున్నారు. ఈ గ్రామాల్లో అందరూ కలసి ఒకేసారి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో పల్లెల్లో సందడి వాతావరణం నెలకుంది. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పెద్దలు పాల్గొన్నారు.

వెట్టిచాకిరి నిర్మూలనకు కృషి



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక శాఖ సిబ్బంది

పాడేరు రూరల్ : వెట్టిచాకిరి కార్మికులు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కార్మిక శాఖ జిల్లా ఇన్‌చార్జి సుజాత అన్నారు. వెట్టి చాకిరి నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం పాడేరు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చట్టం ప్రకారం వెట్టి చాకిరి అనేది బలవంతంగా శ్రమ చేయించుకొని కనీస వేతనం ఇవ్వకపోవడం కిందకే వస్తుందన్నారు. ఈ విధానంలో కార్మికులను రుణగ్రస్తులు చేస్తూ వారి పని చేసిన శ్రమకు తగ్గ వేతనాలు ఇవ్వకుండా వెట్టి చాకిరిలో చిక్కుకుపోయేలా చేయడం నేరమన్నారు. 1976 నాటి వెట్టి చాకిరి నిర్మూలన చట్టం ద్వారా బానిసత్వానికి గురి చేయడాన్ని ప్రభుత్వం చట్టం విరుద్ధం చేసిందన్నారు. యాజమన్యాలు కార్మికుల చేత వెట్టి చాకిరి చేయిస్తే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం వెట్టి చాకిరి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. లేబర్ ఇన్‌స్పెక్టర్ దేవి గణేష్, పాడేరు ఎస్‌ఐ లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ రాజబాబు, కో-కన్వీనర్ అమర్, పాడేరు హెడ్‌కానిస్టేబుల్ వెంకటరావు, ఉమా మోద నీలకంఠేశ్వర ఎలక్ట్రికల్, ప్లంబింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు రామారావు, నాయకులు బబ్లూ, ప్రకాశరావు, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



భక్తులతో యలమంచిలి ఎస్‌ఐ నాయుడు దంపతులు తదితరులు

హుకుంపేట: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, ఆధ్యాత్మిక కేంద్రం మత్స్యలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి పూజలు, అర్చనలు తదితర కార్యక్రమాలు జరిగాయి. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాన్ని యలమంచిలి ఎస్‌ఐ కె.పి.నాయుడు కుటుంబసమేతంగా సందర్శించారు. ఆయన గతేడాది హుకుంపేటలో ఎస్‌ఐగా పనిచేసి యలమంచిలికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను సర్పంచ్ శాంతకుమారి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సింహాచలం నాయుడు తదితరులు సన్మానించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఈశ్వర్, మత్యకొండబాబు, బాలయ్య, హరినాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలోని సాయినగర్ వీధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గిరిజన మహిళ సంఘం నాయకురాలు పుష్పవతితో పాటు పలువురు స్థానికులు కోరారు. ఈ మేరకు వారు స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో గురువారం నిరసన తెలిపారు. పలువురు మాట్లాడుతూ కాలనీలో తాగునీటి సమస్య వల్ల ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు స్పందించి, సమస్య పరిష్కరించాలని కోరారు. గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నయ్య పడాల్ తదితరులు పాల్గొన్నారు.

రుణ యాప్‌లతో అప్రమత్తం



రాజంపాలెంలో జనమైత్రి సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌ఐ అప్పలరాజు

అడ్డతీగల: మండలంలోని రాజంపాలెంలో ఎస్‌ఐ అప్పలరాజు ఆధ్వర్యంలో గురువారం రాత్రి జనమైత్రి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో రుణ యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ రుణాల ప్రకటనలు చూసి మోసపోవద్దన్నారు. ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకున్న వ్యక్తులు చాలా మంది వేధింపులు భరించలేక ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. అందుకే అటువంటి వాటి జోలికి పోవద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనచోదకులు తప్పనిసరిగా రహదారి భద్రత నిబంధనలు పాటించాలన్నారు. ప్రతి గ్రామంలో జనమైత్రి సదస్సులు నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.గొండొలు సర్పంచ్ నాగులపల్లి రాఘవ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా తీర్థం

కశింకోట : అమీన్‌సాహెబ్‌పేట గ్రామంలో అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం గురువారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పరిసర గ్రామ ప్రజలు ఆంజనేయస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సతీమణి గుడివాడ హిమగౌరీ, తల్లి నాగమణి, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్, డైరెక్టర్ శరగడం శంకరరావు, ఎంపీ సత్యవతి భర్త డాక్టర్ కె.విష్ణుమూర్తి తదితరులు తీర్థ మహోత్సవానికి హాజరై, స్వామిని దర్శించుకున్నారు. వీరికి డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, సర్పంచ్ మలసాల ధనమ్మ సాదర స్వాగతం పలికారు. తీర్థ మహోత్సవం పురస్కరించుకుని చింతలపాలెం, ఏనుగుతుని, ఏఎస్ పేట గ్రామాలకు చెందిన నాలుగు మహిళా బృందాలతో ప్రదర్శించిన కోలాటాలు ఆహుతుల్ని విశేషంగా అలరించాయి.